క్లుప్తంగా

8న ఐటీఐలో జాబ్ మేళా

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8వతే దీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి , స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడీప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. 18 సంవత్సరాలపైన 30 సంవత్సరాల వయస్సులోపు కలిగిన వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్సు కాపీ, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

9న తలనీలాల సేకరణకు వేలం

తంబళ్లపల్లె: మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్యకొండపై నిర్వహించే ఉత్సవాల సందర్భంగా తలనీలాల సేకరణ, పూజాసామగ్రి అమ్మకాల హక్కు కల్పించేందుకు ఈనెల 9వతేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ ఒక ప్రకటనలో తెలిపారు. మల్లయ్యకొండ దేవస్థానంలో ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందన్నారు. తలనీలాల సేకరణ రూ.లక్ష, వాహనాల పార్కింగ్ రూ.లక్ష, గౌరమ్మగుడి, ఏనుగుమల్లయ్యగుడి, కొబ్బరి చిప్పల సేకరణ హక్కులు పొందేందుకు రూ.50 వేలు దరావత్తు చెల్లించాలన్నారు. వీరన్నగెవి వద్ద పూజా సామగ్రి అమ్ముకునేందుకు రూ.10 వేలు, కొండపైన టెంకాయలు, పూజాసామగ్రి, కూల్‌డ్రింక్ షాపులు, వివిధ రకాల అంగళ్లు పెట్టుకునేందుకు హక్కు పొందేందుకు రూ.50 వేలు దరావత్తు చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మదనపల్లె సిటీ: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ప్రకాష్‌రతన్ తెలిపారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో బ్రాంచ్ ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు నిత్యం ఒత్తిడి గురవుతుంటారన్నారు. అందు కోసం క్రికెట్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. రీజియన్ పరిధిలోని 47 బ్రాంచ్ ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు విద్యార్థులకు యూనిఫాం

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆదివారం బి.కొత్తకోటకు చెందిన భారత్ ఇంగ్లిషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ జహ్నారా, ప్రిన్సిపల్ శ్రీనివాసులు విద్యార్థులకు యూనిఫాం వితరణ చేశారు. అలాగే బియ్యంకు కూడా ఇచ్చారు. పాఠశాల గురించి వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి వివరించారు. వారి దాతృత్వానికి అభినందించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు భక్తులు

రామసముద్రం : మండలం నుంచి వందల సంఖ్యలో భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం కోసం స్వామి మాల ధరించి ఇరుముడి కట్టుకుని గోవిందా..గోవిందా అంటూ శ్రీనివాసుడి నామస్మరణలతో ఆదివారం కాలినడకన బయలుదేరారు. రామసముద్రం, తిరుమలరెడ్డిపల్లె, గుంతలపేట, నరసాపురం, శ్రీరాములుపల్లె, జంగాలపల్లె, కమతంపల్లె గ్రామాల నుంచి వెంకన్నభక్తులు వందల మంది పాదయాత్రతో బయలుదేరారు. స్థానిక లక్ష్మీజనార్ధనస్వామి, అడ్డకొండలోని శ్రీ గెవితిమ్మరాయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈనెల 10వతేదీన ముక్కోటి ఏకాదశి నాటికి భక్తులు తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకోనున్నారు. వీరికి గందోడి ఆంజప్ప, పూజారి గంగప్ప, నాగార్జున, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రామచంద్ర, నరసాపురం గ్రామస్తులు భోజన సదుపాయం కల్పించారు.

రెడ్డెమ్మ తల్లీ..చల్లంగ చూడమ్మా..!



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: రెడ్డెమ్మ తల్లీ చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లిని మొక్కుకొన్నారు. ఆదివారం ఆలయం భక్తుల రద్దీతో కిటికిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేషమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ముందు వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు ఆలయమెట్లకు పూజలు నిర్వహించి ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అల్లుకున్న ప్రమాదం

విద్యుత్ తీగలకు ప్రమాదం అల్లుకుంది. మండలంలోని యర్రయ్యగారిపల్లెలో నివాసలపైనే 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా పొంచి ఉన్నాయి. అలాగే మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం వద్ద రైతుల పంట పొలాల్లో 33 కేవీ విద్యుత్ లైన్ తీగలకు పచ్చని తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలకు పచ్చని తీగలు అల్లుకుంటే భూమిలోకి కూడా విద్యుత్ సరఫరా అయ్యి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే నివారణ చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

- కలకడ



గోపాలపురం వద్ద 33 కేవీ విద్యుత్ లైన్‌కు అల్లుకుంటున్న పచ్చని తీగలు

కమ్మేసిన పొగమంచు



రామసముద్రంలో కురుస్తున్న పొగమంచు



గుర్రంకొండ: కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ..

రహదారులను ఆదివారం పొగమంచు కమ్మేసింది. చలి తీవ్రత పెరగడంతో పాటు వేకువజాము నుంచి మంచు కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటలైనా పొగమంచు కురుస్తుండటంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. వాహనాల లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. చెట్ల ఆకులపై, గడ్డిపోచలపై మంచు నీటి బిందువులు వర్షపు నీటిలా నేల రాలాయి. సూర్యుడు మేఘాల పొరల నుంచి తేరుకుంటూ వచ్చాడు. చలిమంచు తీవ్రతకు రైతులు, కూలీలు పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

- రామసముద్రం/గుర్రంకొండ

వ్యవసాయ పనులకు కూలీల కొరత

- ఈసీజన్‌లో 3258 ఎకరాల్లో వరిసాగు
- వరి కోత యంత్రాలకు భలే డిమాండ్

గుర్రంకొండ: వ్యవసాయ పనులు కొనసాగించడానికి కూలీల కొరత రైతులను తీవ్రంగా వేదిస్తోంది. ముఖ్యంగా వరి పంట కోయడానికి కూలీల ఖర్చును రైతులు భరించలేక పోతున్నారు. ప్రత్యామ్నాయంగా రైతులు వరికోత యంత్రాలకు ప్రాధాన్యత ఇస్తుండడంతో వాటికి భలే డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం నియోజకవర్గంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.

3258 ఎకరాల్లో వరిసాగు

నియోజకవర్గంలో ఈసీజన్‌లో 3258 ఎకరాల్లో వరిసాగు చేశారు. ప్రస్తుతం అన్ని మండలాల్లోనూ వరి పంట కోత దశకు చేరుకొంది. దీంతో కోతలు, పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీల కొరతకారణంగా పలు రకాల వరికోత యంత్రాలు 28 వరకు నియోజకవర్గంలో రైతులకు అందుబాటులో ఉన్నాయి.

కూలీల ఖర్చు రూ.16 వేలు

వరి పంట కోయడానికి కోతల దగ్గర నుంచి పంటల నూర్పిళ్ల వరకు కనీసం 15 నుంచి 20 మంది వరకు కూలీల అవసరముంటుంది. ఒక్కో కూలీకి కనీసం గరిష్టంగా రూ. 800 వరకు ప్రస్తుతం రైతులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఒక ఎకరం వరిపంట ఇంటికి చేరాలంటే రైతుకు రూ.16 వేల వరకు ఖర్చు వస్తుంది. అసలే పెట్టుబడులు, గిట్టుబాటు లేని సేద్యంతో



కొత్తపల్లెలో వరికోత యంత్రాలతో పంటకోతలు

మండలంపేరు	పంటసాగు విస్తీర్ణం	యంత్రాలు
గుర్రంకొండ	420	05
పీలేరు	682	06
వాల్మీకిపురం	526	04
కలికిరి	623	06
కేవిపల్లె	542	04
కలకడ	465	03

కుదేలవుతున్న ఈ సమయంలో కూలీలకొరత మరింతగా రైతులను కుంగదీస్తోంది. వరిసాగు కొనసాగించాలంటే పెట్టుబడులతో పాటు ఆధునిక సాగు పద్ధతులను అందిపుచ్చుకోవాల్సిందేనని రైతుల్లో అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వరికోత యంత్రాలో ఖర్చు ఆదా

వరికోత యంత్రాలతో రైతులకు కూలీల ఖర్చులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం పంట కోతకు వచ్చే సమయానికి కూలీల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కూలీల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో రైతులు వ్యవసాయపనులు ముందుకు సాగడం లేదు. ఈనేపథ్యంలో వరి పంట కోతకు రైతులు కూలీలకు బదులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరికోతలకు యంత్రాలను వినియోగిస్తున్నారు. కోతయంత్రానికి గంటకు రూ.3500 అద్దె చెల్లించాల్సి ఉంది. ఎకరం పంటను వరికోత యంత్రం ఒకటిన్న గంటల సమసయంలో పని ముగిస్తుంది.

కూలి రేట్లు పెరిగిపోయాయి

ప్రస్తుతం గ్రామాల్లో కూలీలకు భలే డిమాండ్ ఏర్పడింది. గతంలో లాగా వ్యవసాయపనులకు కూలీలు దొరకడంలేదు. వరి పంట కోతలకైతే కూలి రేట్లు విపరీతంగా పెంచేశారు. వారి కోరిన మేరకు డబ్బులు ఇస్తామన్నా సమయానికి రావడంలేదు. ఓ వైపు వరికోతల సమయం దాటిపోతోంది. మరోవైపు కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు.

- నరసింహులు, గంగిరెడ్డిపల్లె

యంత్రాలే ఎంతో నయం

వరికోతలకు కూలీల కంటే వరికోత యంత్రాలే ఎంతో నయంగా అనిపిస్తోంది. వరి కోతలకు, వడ్లు కుప్పకొట్టేందుకు వేర్వురుగా కాంట్రాక్టులు అడుగుతున్నారు. ఈవిధంగా చేస్తే రైతులకు తలకు మించిన భారం పడుతోంది. కూలీలకైతే రూ.20 వేల వరకు, యంత్రానికైతే రూ.6 వేల వరకు ఖర్చు వస్తోంది. యంత్రాలైతే కోత కోసి వడ్లు కూడా అప్పటికప్పుడు సంచులకు నింపుతాయి.

- లక్ష్మన్న, కొత్తపల్లె

నేటి నుంచి పింఛన్ల పునఃపరిశీలన

పీలేరురూరల్ : వందశాతం అంగవైకల్యం కలిగిన పింఛన్ల లబ్ధిదారులను గుర్తించేందుకు సోమవారం పునఃపరిశీలన చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వందశాతం అంగవైకల్యం కలిగిన వారు 76 మంది పెన్షన్ పొందుతున్నారని చెప్పారు. కడప వైద్య బృందం డాక్టర్ ఆనంద, డాక్టర్ మనోహర్ మూడు రోజుల పాటు మండలంలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

వైభవంగా గంధోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో సులేమాన్ షావలి దర్గా

ములకలచెరువు: మండలంలోని పెద్దపాళ్యంలో వెలసిన హజరత్ సయ్యద్ సులేమాన్ షావలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధమహోత్సవాన్ని స్థానికులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ఆవరణంలో విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మతగురువులు గంధంను పెద్దపాళ్యం పీర్ల చావిడి నుంచి ఊరేగించి దర్గావద్దకు చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో మతగురువులు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల సింహగర్జన

- మార్చి 2న తిరుపతి ఎస్వీ గ్రౌండ్స్‌లో బహిరంగసభ
- విజయవంతంపై మదనపల్లెలో సన్నాహక కమిటీ సమావేశం
- ఐక్యతతో రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపు



మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తిరుపతి ఎస్వీ గ్రౌండ్స్‌లో మార్చి 2న నిర్వహిస్తున్న రాయలసీమ మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయనాయకులు యమలా సుదర్శనం కోరారు. ఆదివారం పట్టణంలోని దేశాయ్‌ఫంక్షన్‌హాల్‌లో రాయలసీమ మాలల సింహగర్జన సమావేశం విజయవంతంపై సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. మాల మహానాడు జాతీయనాయకులు యమలా సుదర్శనం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులు వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన గళం వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342లకు వ్యతిరేకంగా కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వాలు కుట్రపూరితంగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతూ ఎస్సీ,ఎస్టీ కులాల ఐక్యతకు భంగం కలిగించే విధంగా చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. వర్గీకరణ చేసే హక్కు కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై 2005లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకోకపోవడం చూస్తే, ప్రస్తుత తీర్పు రాజకీయ కుట్రలో భాగమేనని స్పష్టమవుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే మాలలకు అన్యాయం జరిగి భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలంటే మాలలు ఐకమత్యంగా ఉండాలన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశగా మాలల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మాల సింహగర్జన విజయవంతానికి జేఏసీని ఏర్పాటుచేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ప్రతి మాలపల్లెకు వెళ్లి సభ విజయవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అశోక, రత్నం, గద్దంనాగముని, వెంకయ్య, తిరుపతి ప్రభాకర్, మధు, జే.వి.రమణ, రమేష్, గుండామనోహర్, చంద్రయ్య, కెళవాతి మణి, కే.రామచంద్ర, సుమిత్రరమణ, చింతపర్తిశివయ్య, కందస్వామి, మల్లెలమోహన్, లక్ష్మీపతి, వెంకటస్వామి, సుధాకర్, నాగార్జున, అంజప్ప, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నాయకుల పరామర్శ

మదనపల్లె : అనారోగ్యంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న రెడ్డిజ్యోతి కుటుంబ సభ్యులను స్థానిక నాయకులు పరామర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తరపున ఆయన కుమారుడు జునైద్ అక్బరీ, స్థానిక నాయకులతో కలిసి కొమ్మిరెడ్డిగారిపల్లెకు చేరుకున్నారు. బాధిత కుటుంబసభ్యులైన కే.రమణ, రెడ్డెమ్మ దంపతులను పరామర్శించారు.

నిమ్మనపల్లె రైతుకు సంక్రాంతి పురస్కారం



అభ్యుదయ రైతు పురస్కారం అందుకుంటున్న గంగులప్ప

నిమ్మనపల్లె : మండలంలోని తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లెకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు సి.గంగులప్పకు రైతు నేస్తం ఫౌండేషన్ సంక్రాతి సంబరాల్లో భాగంగా అభ్యుదయ రైతు పురస్కారం ప్రదానం చేసింది. శనివారం సాయంత్రం గుంటూరు వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ లావుకృష్ణదేవరాయలు చేతులమీదుగా సి.గంగులప్ప అభ్యుదయ రైతు పురస్కారం అందుకున్నారు. నిమ్మనపల్లె మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ తనకు ఉన్న 6 ఎకరాల్లో రసాయనరహిత దేశవాళీ విత్తనాలతో బొప్పాయి, మునగ, టమాటా, వంగ, మిరప తదితర 20 రకాల పంటలను పండించడమే కాకుండా నర్సరీ నిర్వహిస్తున్నారు. వీటికోసం దేశీయ ఆవుల పేడ, గోమూత్రం వినియోగించి పంటలు పండిస్తున్నాడు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో నిమ్మనపల్లె మండలంలో గంగులప్ప ప్రకృతిసేద్యం చేస్తూ పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం ఆయన కృషిని గుర్తించి రైతునేస్తం ఫౌండేషన్ అభ్యుదయ రైతు పురస్కారం అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన చింతల



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో ఆదివారం పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి సూచించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్‌సీపీతో పాటు అనుబంధ విభాగాల నూతన కార్యవర్గాల నియామకానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలలోకి తీసుకెళ్ళేలా కార్యచరణలు రూపొందించడంపై మంత్రితో చర్చించినట్లు మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పరామర్శ

నియోజకవర్గంలోని గుర్రంకొండ మండలం టి.రాచపల్లి గ్రామం దిగువ బురుజుపల్లికి చెందిన విశ్రాంత వీడీఓ నరసింహారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలో చికిత్సలు పొంది తిరుపతిలోని ఎంఆర్ పల్లి క్రిష్ణానగర్‌లో ఉంటున్నారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎంఆర్‌పల్లికి చేరుకుని ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఆనందరెడ్డి పాల్గొన్నారు.

అటకెక్కిన ఫిర్యాదుల పెట్టె



మూలన పడేసిన ఫిర్యాదుల బాక్సు

పెద్దతిప్పసముద్రం: స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బహిరంగ ప్రదేశంలో ఉండాల్సిన ఫిర్యాదుల బాక్సు అటకెక్కడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఉపాధి హామీ పనులకు సంబంధించి లేదా సిబ్బంది పని తీరు, జరిగిన పనుల్లో ఏదైనా అవకతవకలు చోటు చేసుకున్నా, బినామీల పేర్లతో మస్టర్లు ఇలా ఏమైనా అధికారులకు నేరుగా చెప్పుకోలేని పరిస్థితుల్లో ప్రజలు కార్యాలయంలో ఉన్న ఫిర్యాదుల బాక్సు ద్వారా వారి అభిప్రాయాలను తెలియజేస్తారు. అయితే అధికారుల అలసత్వం కారణంగా ఫిర్యాదుల బాక్సును కార్యాలయం పైన నిరుపయోగంగా ఉన్న చెత్త పేపర్ల నడుమ మూలన పడేశారు. కనీసం ఇప్పటికైనా అధికారులు ప్రజలకు ఉపయోగ పడేలా ఫిర్యాదుల బాక్సును అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పాల శీతలీకరణ కేంద్రం మూసివేత

- ఏడాదిన్నరగా డీఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యం
- రవాణా సమస్యతో తగ్గిన పాల సేకరణ
- సీటీఎం బీఎంసీయూకి తరలింపు
- పట్టించుకుంటారో లేదో అధికారులకే చెప్పాలి



మూతపడిన కోటావూరు బీఎంసీయూ

బి.కొత్తకోట: అధికార యంత్రాంగం స్పందిస్తే ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారం లభిస్తుంది కాని బి.కొత్తకోట మండలం కోటావూరు పాలశీతలీకరణ కేంద్రం (బీఎంసీయూ)కు సంబంధించి చిన్న సమస్యకు ఏడాదిన్నరగా పరిష్కారం దొరకడం లేదు. సమస్య పరిష్కారాన్ని పక్కన పెట్టిన అధికారులు ఏకంగా బీఎంసీయూకే తాళం వేశారు. ఫలితంగా పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా సేకరించిన పాలను దూరంగా ఉన్న బీఎంసీయూకి తరలించుకోవడం సమస్యగా మారింది.

నీటి గుంత లేదని..

కోటావూరు బీఎంసీయూని 2007లో హార్సిలీహిల్స్ కింద ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. అప్పట్లో దీని ఏర్పాటుకు భవనం లేకపోవడంతో కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయం ఇచ్చేశారు. అందులో ట్యాంకర్, పాల క్యాన్లు, ఇతరా యంత్ర సామగ్రిని ఏర్పాటు చేసుకుని బీఎంసీయూ పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభం నుంచి మెల్లగా మొదలైన పాల సేకరణ ఏడాదిన్నర క్రితం మూసేసిన సమయానికి రోజుకు 7,500 లీటర్లకు చేరింది. మంచి లాభాలతో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ కేంద్రం నిర్వహణ సాగుతూ వచ్చింది. అంతవరకు లేని ఇబ్బంది మూత పడిన సమయం వరకు రానిది తర్వాతే వచ్చింది. కేంద్రంలో ట్యాంకర్, క్యాన్లు తదితర వాటిని శుభ్రం చేసే నీళ్ల వెలుపలికి వెళ్తాయి. ఈ నీళ్ల కోసం పక్కనే గుంతను తవ్వి అందులోకి మళ్లించారు. తర్వాత ఈ గుంత ఉన్న చోటు ప్రైవేటు స్థలం కావడంతో ఇక్కడ ఇంటి నిర్మాణం జరిగింది. దీనితో నీళ్ల వెలుపలికి పంపినా గుంత లేదని దీనికారణంగా బీఎంసీయూను నడపలేమని పూర్తిగా మూసేశారు. అప్పటి నుంచి ఇది మూతపడి ఉన్నా పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది.

సీటీఎం కేంద్రానికి పాలు :

కోటావూరు బీఎంసీయూ మూత పడటంతో ఈ కేంద్రం పరిధిలోని 54 పల్లెల నుంచి సేకరించే పాల సేకరణలో ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక్కడ సేకరించే పాలను మదనపల్లె రూరల్ మండలం చిన్నతిప్పసముద్రం బీఎంసీయూకు తరలిస్తున్నారు. దీనితో పాల సేకరణ కోసం రవాణా భారం అధికంగా పడుతోంది. కోటావూరు కేంద్రానికి పాలను తరలించేందుకు ఒక లీటర్‌కు 70 పైసలు ఖర్చు చేసేవారు. ఇప్పుడు 50 పైసలు అదనంతో లీటర్‌కు రూపాయి 20 పైసలు ఖర్చు చేస్తున్నారు. ఖర్చు పెరిగినా పాలసేకరణ మునుపటిలా లేదు. వెయ్యి లీటర్లకుపైగా పాల సేకరణ తగ్గిపోయింది.

ఇదే పరిస్థితి కొనసాగితే పాల సేకరణ పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంది. ఈ విషయమై బి.కొత్తకోట వెలుగు ఏపీఎం రాజేశ్వరీ మాట్లాడుతూ కోటావూరు బీఎంసీయూని ఎప్పుడు ప్రారంభించాలో డీఆర్‌డీఏ పీడీ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని శుక్రవారం చెప్పారు. కొత్తగా నిర్మించిన భవనంలో విద్యుత్ సౌకర్యం, యంత్రాల ఏర్పాటు పనులు ఉంటాయని చెప్పారు. దీనిపై పీడీనే చర్యలు తీసుకుంటారని, ఇది తన పరిధిలో లేదని స్పష్టం చేశారు.